వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 10 అక్టోబర్ 2024

## చెర్లోపల్లెలో చిరుత కలకలం..



**చిట్వేలి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
చిట్వేలి మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు కలకలం నెలకొంది. స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారి ధీరజ్ తెలిపిన వివరాల మేరకు మంగళవారం తెల్లవారుజామున పెద్దగొర్ల సుబ్బరాయుడుకు చెందిన నిండు సూటి మేకను మెడ, పొట్ట భాగంలో గాయం చేసి చంపినట్లు తిరిగి మంగళవారం రాత్రి చిరుత సంఘటన స్థలంలో సంచరించినట్లు బాధితులు తెలిపారన్నారు. బుధవారం రైల్వేకోడూరు సబ్ డీఎఫ్ఓ సుబ్బరాజు ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని, ఆ జంతువు, పాద ముద్రలను పరిశీలించామన్నారు. ఆనవాళ్లు చిరుతకు సమానంగా ఉన్నాయన్నారు. బుధవారం రాత్రి అటవీ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామని చిరుత అని గుర్తించిన వెంటనే బోను ఏర్పాటు చేసి బంధిస్తామన్నారు. గ్రామస్థులు, రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్ఓ ధీరజ్ సూచించారు.

## బాల్ బ్యాడ్మింటన్ స్టార్ ఆఫ్ఆంధ్ర అవార్డును అందుకున్న సీఎస్ఆర్ కళాశాల విద్యార్థి



**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్త:**
పట్టణంలోని బండ్లవీధికి చెందిన బి.విష్ణువర్ధన్ బాల్ బ్యాడ్మింటన్ " స్టార్ ఆఫ్ ఆంధ్ర" అవార్డును అందుకున్నారు. అక్టోబరు 5,6,7 తేదీలలో విశాఖ పట్నం జిల్లా నునవర్తిలో జరిగిన అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున ఆడి విష్ణువర్ధన్ బెస్ట్ ప్లేయర్‌గా నిలిచిన బాల్ బ్యాడ్మింటన్ స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డును అందుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైయ్యారు. వచ్చే ఏడాది జనవరిలో జాతీయస్థాయిలో జరుగు బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడుతాడు, ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడి జట్టు విజయానికి కషి చేస్తానన్నారు. తనను ప్రోత్సహించి ఇంతటి స్థాయికి తీసుకువచ్చిన ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, పీలేరు సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అవినాష్‌రెడ్డి, రాజేష్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, సీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ,సిబ్బంది పట్టణప్రముఖులు విష్ణువర్ధన్‌ను అభినందించారు.

# అన్ని రంగాల్లో డ్రోన్ సేవలను విస్తృతం చేయాలి

**కడప, అక్టోబర్ 9, ప్రభాతవార్త**
ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో డ్రోన్ సేవలు అత్యంత కీలకంగా మారనున్నాయని, డ్రోన్ సేవల సద్వినియోగంతోపాటు, విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో వివిధ రంగాల్లో డ్రోన్ సేవలు వినియోగం, ఆవశ్యకతపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక పరికరాలు అవసరం కూడా పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రంగాల్లో కూడా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించేలా డ్రోన్ సేవల ఆవశ్యకత అవసరం అయిందన్నారు. భవిష్యత్తులో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల సేవలను విస్తృతం చేయడం జరుగుతోందన్నారు . ఇప్పటికే భూముల సర్వే, వ్యవసాయ అనుబంధ రంగాల్లో, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఫారెస్ట్రీ, మైన్స్, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల్లో ప్రభుత్వం డ్రోన్ సేవలను వినియోగిస్తోందన్నారు. వ్యవసాయరంగంలో పంటలపై పురుగు మందులు పిచికారీ చేయడంలో, పంచాయతీ మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం నిర్వహణలో దోమలను అరికట్టేందుకు స్ప్రే చేయడం కోసం, అటవీశాఖలో సామాజిక అడవుల పెంపకంలో సీడ్ బాల్స్ చల్లడంలో, ల్యాండ్స్ సర్వే శాఖలో డ్రోన్ల జియోట్యాగ్ ద్వారా సర్వేలు చేయడం, మైన్స్ క్వారీలు, ఇసుక రీచ్‌లలో ఇసుక నిల్వలు ఎంత ఉన్నవి, ఎంత మేర వినియోగదారులకు సరఫరా చేయడమైనది తదితర వివరాలను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేయడంలో పలు శాఖల్లో పనులు సులభతరంగా జరుగుతున్నాయన్నారు. కాగా డ్రోన్ సేవలను అందించేందుకు సివిల్ ఏవియేషన్ నిబంధనలు, డ్రోన్ యాక్ట్‌లకు లోబడి అనుమతి పొందిన వారే డ్రోన్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డ్రోన్ నిర్వహణ ఆపరేటింగ్ కోసం శిక్షన పొందిన వారికి మాత్రమే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ పొందిన వారిని డ్రోన్ పైలెట్‌గా లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

**డ్రోన్ పైలెట్ కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**
జిల్లాలో వివిధ శాఖల్లో డ్రోన్ పైలెట్‌గా విధులు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అందుకోసం ఇంటర్మీడియట్ పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ నెల 10వ తేది నుండి 21వ తేది వరకు జిల్లా కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంలో బయోడేటాతో నేరుగా సంప్రదించవచ్చున్నారు. వివరాలకు 8712644805 కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, డ్వామా పిడి విజయ్‌కుమార్, కెఎంసి అదనపు కమిషనర్ రాకేష్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణు గోపాల్‌రెడ్డి, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ, రెవెన్యూ, సర్వే లాండ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కంటిపరీక్షలకు కూటమి ప్రభుత్వం మంగళం

**- పరీక్షలతో పాటు ఉచిత కళ్లద్దాల పంపిణీకి బ్రేక్**



**రాయచోటి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వాసుపత్రులలో కంటి పరీక్షలకు మంగళం పాడిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కంటి వైద్యం అందిస్తున్న ఈఐ కేంద్రాల గడువు ముగిసినా రెన్యువల్ చేయకుండా వాటిని నిర్వీర్యం చేసేందుకు ఒడిగట్టిందన్నారు. ఈఐ కేంద్రాల సేవలు, కంటి అద్దాల పంపిణీ ప్రక్రియ ఆగిపోవడంపై సంబంధిత వైద్యాధికారులను అడుగుతఉంటే నేత్ర పరీక్షలకు సంబంధించి ప్రైవేటు కంపెనీలతో ఒప్పందం గడువు ముగిసిందని ఆ సంస్థ మిషన్లతో పాటు కంప్యూటర్‌ను కూడా తీసుకెళ్లారని చెబుతున్నారన్నారు. ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వహణకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకొని రోగి ఇంటి వద్ద విశ్రాంతి పొందే సమయంలో జీవన భృతి కోసం ఆరోగ్య ఆసరా కింద జగన్ ప్రభుత్వంలో ఆర్థిక సాయం అందేదన్నారు. 1519 రకాల వ్యాధులలో చికిత్సలు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు అనంతరం కోలుకునే సమయంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్టంగా నెలకు రూ.5వేలు మరియు వ్యాధి తీవ్రతను బట్టి అదనంగా వైద్య నిపుణుల సూచనల మేరకు జీవనోపాధి భృతిని అందజేయడం జరగలేదన్నారు. కాన్పు అయిన మహిళలకు ఆరోగ్య ఆసరా కింద రూ.5వేలు అందేదన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన 48 గంటల లోపు రోగి బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరిగేదన్నారు. అయితే ఈ ప్రభుత్వంలో ఆరోగ్య ఆసరాను నిలిపివేశారని శ్రీకాంత్‌రెడ్డి దుయ్యబట్టారు.

## కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్ర మంత్రి సత్యకుమార్



**కడప కార్పొరేషన్, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
కాశినాయన పుణ్యక్షేత్రం అయిన జ్యోతి క్షేత్రంలోని సమస్యలపై కేంద్ర అటవీశాఖామంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఏపీ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ కలిశారు. జ్యోతి క్షేత్రానికి 15 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. కాశినాయన క్షేత్రంలోని ఆలయ నిర్మాణాలను అటవీశాఖాధికారులు వాడుకుంటున్నారని బీజేపీ కడప జిల్లా అధ్యక్షులు వంగళ శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ కడప పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డిలు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ పేర్కొన్నారు. ఆలయానికి అవసరమైన కనీస అభివృద్ధి పనులను అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారని తీవ్రంగా దెబ్బతీసేలా 2014 ఫిబ్రవరి కేసు కూడా పెట్టారని కాశినాయన ఆశ్రమ కమిటీ కోరిందన్నారు. కడప జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. అందులో భాగంగా కేంద్ర మంత్రిని కలిసి కాశినాయన క్షేత్రంలోని ఆలయ నిర్మాణాలకు 15 ఎకరాల స్థలం రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరడం జరిగిందన్నారు.

# ప్రజలకు తీరనున్న ఇసుక కష్టాలు

**కొత్తగా 5 ఇసుక క్వారీలు**

**రాజంపేట సమీపంలోనే 3 ఇసుక క్వారీలకు టెండర్లు**



**రాజంపేట అర్బన్, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**
అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం ఒకే ఒక్క ఇసుక క్వారీతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఆ సమస్య తీరనుంది. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఈ మేరకు కొత్త క్వారీలకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 5ఇసుక క్వారీలలో తవ్వకాలు ప్రారంభించేందుకు జిల్లా గనులు, భూగర్భ శాఖ బుధవారం టెండర్లు పిలిచింది. రాజంపేట ప్రాంతంలోనే మూడు ఇసుక క్వారీలకు అనుమతిఇచ్చారు. రాజంపేటకు కేవలం 10కిలోమీటర్ల లోపే పెనగలూరు మండల పరిధిలో ఉన్న నారాయణ నెల్లూరు, కోమంతరాజు పురం వద్ద చెయ్యేరు నదిలో ఇసుక క్వారీలకు అనుమతినిచ్చారు. అలాగే నందలూరు మండలంలో టంగుటూరు ఇసుక క్వారీని ఎంపిక చేశారు. వీరబల్లె మండలంలో మట్లి, వీరబల్లి ఇసు క్వారీలకు అనుమతి లభించింది. ఈ 5ఇసుక క్వారీలలో 43.75ఎకరాల విస్తీర్ణంలో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు. నదిలోని ఇసుక క్వారీలోంచి రవాణా చేసేందుకు కాంట్రాక్టర్ల ట్రాక్టర్లకు కూడ అనమతి ఇచ్చారు. ప్రస్తుతం ఆర్.బుడగుంట పల్లె ఇసుక క్వారీ నుంచి రాజంపేట ప్రాంతానికి ట్రాక్టర్లలో వెళ్లేందుకు యజమానులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. అందుకు కారణం ఘాట్ రోడ్డు కావడం రవాణా చార్జీలు ఇసుకతో కలిపి ఎక్కువ ధర పడుతుండటంతో వెళ్లడం లేదు. తాజాగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. 14వరకు ఇసుక తవ్వకాలకు రవాణాలో పాల్గొనేందుకు టెండర్లు ఆహ్వానించారు. 14వ తేది నాటికి టెండ్ల ప్రక్రియ పూర్తి చేస్తారు. అదే రోజున టెండర్లు ఓపెన్ చేస్తారు. దీన్ని బట్టి చూస్తే ఈ నెల 20నాటికి 5క్వారీలలో ఇసుక రవాణాను ప్రారంభించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## ఆదిని విమర్శించే నైతిక హక్కు రామసుబ్బారెడ్డికి లేదు

**- టీడీపీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి**




**జమ్మలమడుగు, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి లేదని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. అభివృద్ధి చేసే వ్యక్తిని విమర్శిస్తే కోపం రాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గతంలో మమ్మల్ని విమర్శించినప్పుడు ఈ విమర్శ అప్పుడు ఎందుకు లేదని ప్రశ్నించారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు కనబడడం లేదా, నియోజకవర్గానికి మొదటి దశలో రూ.16కోట్లు అభివృద్ధి పనులు తెచ్చినవి కనపడడం లేదా అన్నారు. గత 3 నెలల్లో మూడు సార్లు ఉచిత వైద్య శిబిరాన్ని, జాబ్‌మేళా నిర్వహించి నియోజకవర్గానికి అన్ని విధాలా అండగా ఉన్నామని తెలిపారు. కార్యకర్తల కోసం, నియోజకవర్గం అభివృద్ధి కోసం మా దేవగుడి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు. వైద్యం, విద్య బాగుంటేనే నియోజకవర్గం బాగుంటుందని నమ్మిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. బాధ్యతతో పనిచేసే ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు నిర్మాణాత్మకంగా విమర్శించాలి కానీ ఇష్టానుసారంగా విమర్శించడం తగదన్నారు. చిన్న వయసులోనే ఎంపీగా పోటీ చేసి ఐదు నియోజకవర్గాల్లో అవినాష్‌రెడ్డిని ఓడించిన విషయం మీకు తెలియదా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర్‌రెడ్డి, గోన పురుషోత్తంరెడ్డి, ప్పాతోట శ్రీను, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బంగారు నగల కోసమే సిఐ తల్లి హత్య

**- నమ్మినందుకే ఘాతుకానికి వడిగట్టాడు**

**- ఆరోగ్య కుదుటపరుస్తామని స్నేహితునితో కలసి అంతం**

**- హత్య కేసులో నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించిన ఎస్‌పి**

**మదనపల్లెక్రైం, ఆక్టోబర్ 9 ప్రభాతవార్త :**
బంగారు నగల కోసమే సిఐ తల్లిన్ల స్వర్ణకుమారిని దారుణంగా హత్యచేసినట్లు అన్నమయ్యజిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బుధవారం మద్యాహ్నం డిఎస్‌పి కార్యాలయంలో మదనపల్లెలో సంచలనం కలిగించిన స్వర్ణకుమారి హత్యకేసులో నిందితుడి అరెస్టు వివరనాలను ఎస్‌పి మీడియాకు వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కలికిరి మండలం, మేడికుర్తికి చెందిన స్వర్ణకుమారి(63)కు మదనపల్లె రూరల్ మండలం సిటిఎంకు చెందిన ప్యారం శ్రీరాములతో వివాహం అయ్యింది. వీరికి కుమారుడు నాగేంద్ర కలడు. 30ఏళ్ళ క్రితం భర్తతో స్వర్ణకుమారి విడిపోయింది. అనంతరం పట్టణంలోని దేవలవీధిలో ఇళ్ళు నిర్మించుకొని ఇక్కడే స్థిరపడి కుమారుడు నాగేంద్రతో కలసి జీవించేది. కుమారుడు పోలీస్‌శాఖలో ఉద్యోగం సంపాదించి ప్రస్తుతం ధర్మవరం వన్‌టౌన్ సిగా విధులు నిర్వహిస్తున్నాడు. తరువాత స్వర్ణకుమారి జగన్‌కాలనీలో మరో ఇంటిని నిర్మించి అక్కడ నివాసం ఉంటోంది. అదే ప్రాంతంలో స్వర్ణకుమారి పొరుగు గ్రామం మేడికుర్తికి చెందిన సురేంద్ర, యల్లమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు వెంకటేష్ కలడు. స్వర్ణకుమారికి వెంకటేష్ చేదోడు వాదోడుగా ఉంటూ అప్పడప్పుడు పనుల్లో సాయం చేసేవాడు. ఈ క్రమంలో స్వర్ణకుమారికి కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విషయం తెలుసుకొన్న ఎల్లమ్మ, వెంకటేష్(25)లు ఆమె ఆరోగ్యం కుదుట పరుస్తానని చెప్పి స్థానిక నీరుగట్టువారిపల్లెలోని సాయిరాం వీధి, గజ్జలకుంటలో ఉంటున్న మిత్రుడు శంకరప్ప, రమణమ్మల కుమారుడు అనీల్‌తో కలసి పథకం వేసుకొన్నట్లు చెప్పారు. గతనెల 28న గజ్జలకుంటలో అనీనల్ ఇంటికి స్వర్ణకుమారిని వెంకటేష్ బైక్‌లో తీసుకువచ్చి మంత్రాలకు సిద్ధం చేసి పూజలోకి దించాడన్నారు. కొబ్బరి నీళ్ళలో మత్తు మాత్రలు కలిపి, తలపై సుత్తితో కొట్టి అంతమొందించినట్లు పేర్కొన్నారు. ఈనెల 2వ తేదిన ధర్మవరం సిఐ నాగేంద్ర ఫిర్యాదుతో తాలూకా సిఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి 12రోజులు తరువాత అదృశ్యనం కేసు మిస్టరీని టెక్నికల్ సిబ్బంది రాఘవ టీమ్‌తో చేదించి నిందితున్ని అదుపులోకి తీసుకొచ్చారు. వారు ఇచ్చిన సమాచారంతో మంగళవారం మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు సమీపంలోని స్మశానంలో కొత్తగా పూడ్చిపెట్టిన మృతదేహంపైనే పాతి పెట్టగా వెలికి తీసి స్పాట్‌లోనే పిఎం చేసి సిఐకి అపపగించిగా అంత్యక్రియలు చేయించామన్నారు. స్వర్ణకుమారిని హత్యచేసిన నిందితులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో అదేరోజు తాకట్టుపెట్టి నరూ. 4.30లక్షల సొమ్ము తీసుకొన్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఓ గోనెసంచిలో వేసి, ఆరోజు రాత్రి నీరుగట్టువారిపల్లె సమీపంలోని స్మశానవాటికలోన అప్పటికే శవాన్ని పూడ్చి ఉన్న ఓ గుంతను తవ్వి అందులో గోనెసంచితో పాటే మృదేహాన్ని వేసి మట్టి కప్పిపెట్టిసి అక్కడి నుంచి పరారయ్యారు. రెండు రోజుల క్రితం ఆమె ఫోన్ వాడుతూ సినిమా తరహాల్లో సీన్ క్రియేట్ చేశారు. పోతబోలు వరకు ఆన్‌చేసి అక్కడ పడవేసి అక్కడి నుంచి నేరుగా తిరుపతికి వెళ్ళి రేణిగుంటలో విమానంలో బెంగుళూరుకు చేరుకొన్నారు. బెంగుళూరు నుంచి రాజస్థాన్‌కు పరారయ్యారు. తల్లి అదృశ్యం కావడంతో కుమారుడు నాగేంద్ర అక్టోబర్ 1న తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ చంద్రమోహన్:, సిఐ కళావెంకటరమణ అదృశ్యం కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. 12రోజుల తరువాత ఎట్టికేలకు నిందితున్ని కర్నాటక బెంగుళూరులో అదుపులోకి తీసుకొన్నారు. అతను ఇచ్చిన సమాచారంతో మంగళవారం నీరుగట్టువారిపల్లె స్మశాన వాటికలో డిఎస్‌పి కొండయ్యానాయుడు, సిఐలు కళా వెంకటరమణ, రమేష్, రామచంద్ర, చాంద్‌బాషాల బృందంతో తహశీల్దార్ ఖాజాబి, ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికితీసి అక్కడే స్పాట్ పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుమారుడు సిఐ నాగేంద్రకు అప్పగించారు. కుటుంబసభ్యులతో కలసి అదే ప్రాంతంలో తల్లికి అంతిమంగా అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

## కంకర కొంటేనే ఇసుక - ఇదే బ్రోకర్ల మస్కా

**కంకరకు రాయల్టీలుండవ్ - వాహనాలకు పర్మిట్లుండవ్**

**రాజంపేట,అక్టోబర్ 09,ప్రభాతవవార్త :**
బ్లాక్ మార్కెట్ విక్రయించే ఇసుక రేట్లు అధికమని భవన యజమానులు లబోదిబో మంటుంటే విక్రయ అక్రమార్కులు కంకర కొంటేనే ఇసుక అని వాటి విక్రయాల కోసం బ్రోకర్లు ఇళ్ల నిర్మాణ యజమానులకు మస్కా కొడుతున్నట్లు తెలుస్తోంది. బ్రోకర్లు కాదంటే ఎంత బడా వ్యాపారైనా నిజాయితీగా విక్రయిస్తున్నా మామూలు ధరలే పలుకుతున్నప్పటికీ వారి చేతుల్లో కంకర వ్యాపారులు ఫిదా అయి బోల్తా పడుతున్నట్లే తెలుస్తోంది. వాళ్లు తోలే నాసిరకం కంకరకు రాయల్టీలుండవు, వాటిని తరలించే వాహనాలకు అసలు పర్మిట్లు కూడా ఉండనట్లు తెలుస్తోంది. అంతా బ్రోకర్ల గోల్‌మాల్ దందాగానే కనబడుతున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న కంకర క్వారీల యజమానులు బ్రోకర్లకు మామూళ్లిచ్చి మర్యాద చేసుకోకపోతే కంకర క్వారీ నడిపే యజమానులు నిలువునా నష్టపోవలసిందే అలాగని వీళ్లకు మామూళ్ల అందజేస్తే తక్కువ ధరకు కంకరను విక్రయించి ఆ విధంగా కూడా నష్టాలు కావాల్సిందే. ఈ బ్రోకర్లతో క్వారీల యజమానులకు అటు గోడేటు ఇటు చెంపేటు పడ్డట్టుంది. గత ప్రభుత్వం ఈ రాయల్టీలను సంబంధిత అధికారులకు లేకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో వీరి దందా అధికంగా సాగుతుంది. భవన నిర్మాణం చేసే యజమానులకు గోడలు పూర్వయ్యేవరకు కంకరతో పెద్ద అవసరం ఉండదు అయితే అక్రమంగా విక్రయించే కంకర, ఇసుక విక్రయదారులు కంకరను కొంటేనే ఇసుక ఇస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో ఇసుకనే కొనలేకుంటే కంకరను అధిక రేట్లు పెట్టి ఎక్కడ కొనుగోలు చేయాలని యజమానులు బాధపడుతున్నారు. బ్రోకర్లు అక్రమ విక్రయ దారులు పొరుగు జిల్లాల నుంచి తీసుకు వచ్చే అనుమతి లేని నాసిరకం కంకరను విక్రయించి వారినుంచి పర్సంటేజీ తీసుకునేందుకు బాగా అలవాటు పడ్డట్లు కూడా తెలుస్తోంది. ఇదే కాకుండా ఇళ్ల పనులు చేస్తున్న మేస్త్రీలకు కూడా అంతో ఇంతో ఇచ్చి పొరుగు జిల్లాల నుంచి వచ్చే రాయల్టీలు, పర్మిట్లు లేని కంకరను కూడా ప్రస్తుతం అవసరం లేకున్నా రాను రాను కంకర దొరకదు అందులోనూ ఇది మంచి మెటల్ అని దీనిపై ఎలాంటి రాయల్టీలు, ట్యాక్సులు ఇంటి యజమానులకు పడకపోవడమే కాకుండా తక్కువ ధరకే కంకర దొరుకుతుందని బ్రోకర్లు కొడుతున్న మస్కానే బేల్దారి మేస్త్రీలు కూడా అవలంబించి ఇంటి యజమానుల దగ్గర ఇసక, కంకరలను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఇళ్ల మధ్యలోనూ, వీధుల్లోనూ నిల్వ చేసి అక్కడ నుంచే కొనుగోల్ల దారులకు విక్రయించడంతో దీనివలన అధిక కాలుష్యం కూడా ప్రజలను కబలిస్తున్నట్లే తెలుస్తోంది. వీటి పట్ల చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్ల కోసం మనుషుల ప్రాణాలకు ముప్పు తెచ్చే పరిస్థితుల పట్ల కూడా పట్టించు కోకపోవడం ఆశ్చర్యకరంగానే ఉన్నట్లు తెలుస్తోంది.



## రైతు సంక్షేమమే తెదేపా ధ్యేయం



**వీరపునాయునిపల్లె, అక్టోబరు 9, ప్రభాతవార్త :**
రైతు సంక్షేమమే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. వీరపునాయునిపల్లె మండలంలోని అడవిచెర్లోపల్లె వద్ద బుధవారం గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువ నుండి బుడమేరు వాగు ద్వారా నీటిని మళ్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ బుడమేరు వాగు ద్వారా నీటిని మళ్లించడం ద్వారా వీరపునాయునిపల్లె మండలంలోని సంగమేశ్వరస్వామి దేవాళయాల వద్ద పాపఘ్నినదిలో కలుస్తుందన్నారు. దీంతో వీరపునాయునిపల్లె, కమలాపురం, వల్లూరు మండలాల్లోని వేల ఎకరాలు సస్యశ్యామలం అవడంతో పాటు చెరువులు నిండి సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. పాపఘ్నికి నీరు అందించి వీరపునాయునిపల్లె, కమలాపురం, వల్లూరు మండలాల్లోని చెరువులను నింపి పంట పొలాలకు నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే మా తండ్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆశయం అని, ఈరోజు నెరవేర్చడం సంతోషించదగ్గ విషయం అన్నారు. జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పట్టుదలతోనే ఇంత త్వరగా పాపఘ్నికి నీరు వదలగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లేల ఘాట్‌రోడ్డులో మొరాయిస్తున్న వాహనాలు

**తొండూరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :**
తొండూరు మండలంలోని మల్లేల ఘాట్‌రోడ్డులో వాహనాలు మొరాయిస్తున్నారు. మంగళవారం రాత్రి బూడిద ట్యాంకరు అధిక లోడుతో ఎక్కలేక నిలబడిపోవడంతో ట్రాఫిక్ జాం అయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పెద్ద ఓబన్న హుటాహుటిన తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని బూడిద ట్యాంకరును పక్కకు తీయించి వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగించారు. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరచూ భారీ వాహనాలు ఆగిపోతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండడంతో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

**చిట్వేలి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



చిట్వేలి మండలం గట్టుమీదపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు మన్నూరు చెంగయ్య తెలిపారు. తిరుపతి శంకర నేత్రాలయ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మండల వ్యాప్తంగా 60 మంది సేవలను ఉపయోగించుకున్నారని వారిలో 20 మంది కంటిశుక్ల ఆపరేషన్లకు ఎంపికయ్యారన్నారు. మరింతగా రాబోవు రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెంగయ్య తెలిపారు.

## పెన్నానదిలో యువకుడు గల్లంతు - విచారిస్తున్న పోలీసులు





**సిద్దవటం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన సిద్దవటం లోలెవెల్ వంతెన పెన్నానది వద్ద బుధవారం సాయంత్రం పెన్నానదిలో ఒక వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల్లోకెళ్తే కడప నగరం బీడీ కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు రాగా దేవరపల్లి జేమ్స్ (28) అనే వ్యక్తి పెన్నా నదిలో గల్లంతయ్యాడు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆ ప్రాంతానికి వెళ్లి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుని తల్లి సుబ్బమ్మ రోధిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది. ఆ ప్రాంతానికి ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ చేరుకొని ఘటనపై విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పెద్దపల్లి గ్రామ సచివాలయ సెక్రటరీగా రాజేష్

**సిద్దవటం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలం పెద్దపల్లిగ్రామ పంచాయతీ సెక్రటరీగా రాజేష్ బుధవారం గ్రామ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ముఖ్యంగా డ్రైనేజీ పారిశుద్ధ్యంపై ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా పరిష్కారం చేస్తానని ఆయన అన్నారు. ప్లాస్టిక్ వంటి పదార్థాలు డ్రైనేజీలో వేయకుండా గ్రీన్ అంబాసిడర్ వాహనంలో ప్రతి ఒక్కరూ వేయాలని భాకరాపేట బస్టాండు కూడలిలో ఉన్న చిరు దుకాణాదారుల వద్ద అపరిశుభ్రత లేకుండా చూడాలని మురికి నీటిని రోడ్లపైకి వదలరాదన్నారు. విద్యుత్తు సమస్యలుంటే తన దృష్టికి తెస్తే గ్రామ సర్పంచ్ అధ్యక్షతన సమస్య పరిష్కారం చేస్తానని ఆయన తెలిపారు.

## బీజేపీ కార్యాలయం వద్ద అంబరాన్నంటిన సంబరాలు

**బద్వేలు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



హర్యానాలో బీజేపీ పార్టీ మూడవసారి గెలవడంతో పట్టణంలోని విద్యానగర్‌లో బీజేపీ కార్యాలయం వద్ద బుధవారం ఆ పార్టీ కార్యకర్తల చేసిన సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు పుప్పాల శ్రీనాథరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ మోడితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ఇందుకు హర్యానా గెలుపు ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు.అలాగే ప్రస్తుం జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగంతం చేయాలని వారు పార్టీ కార్యకర్తలకుసూచించారు. ఈ కార్యక్రమంలో బిజివేముల భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షులు సంజీవరెడ్డి, రూరల్ మండలాధ్యక్షులు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు గురుశేఖర్, కుప్పాల నరసింహులు, రమణయ్య,,రామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిమాతను దర్శించుకు బీజేపీ రాష్ట్ర నాయకులు బొమ్మన

**బద్వేలు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిశాలలోని అమ్మవారిని బీజేపీరాష్ట్ర నాయకులు బొమ్మన సుబ్బరాయుడు ఎస్‌వీ సుబ్బారావుతో పాటు పలువురు దర్శించుకున్నారు. అలాగే మహాలక్ష్మిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, సెక్రటరీనాగరాజ, మహాలక్ష్మిదేవి ఆలయ అధ్యక్షులు పివిఎన్.ప్రసాద్, కె.రమేష్, టి.సుదాకర్‌లతో పాటు పలువురు ఆయనకుస్వాగతం పలికి శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ఐశ్వర్య లక్ష్మిదేవి అలంకారంలో మహాలక్ష్మి దేవి





**బద్వేలు అర్బన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

దసరా ఉత్సవాలలో భాగంగా మహాలక్ష్మిదేవి ఆలయంలో బుధవారం ఆలయకమిటి అధ్యక్షులు పివిఎన్. ప్రసాద్, సెక్రటీరి కొలిశెట్టి రమేష్, ట్రెజరర్ చీదళ్ల వెంకటసుబ్బయ్యలతో పాటుపలువురు కమిటి సభ్యులు ఆధ్వర్యంలో మహాలక్ష్మిదేవి అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నాడు అమ్మవారు ఐశ్వర్య లక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక ఉభయదాతలుగా కొలిశెట్టి సాంబయ్య, కుమారుడు శివప్రసాద్‌రావు, కీ.శే.వల్లంకొండ రాధాక్రిష్ణ కుమారుదునాగరాజ, కొలిశెట్టి నరసింహారావు, చెవుల పెంచలయ్య, సుంకు విజయభాస్కర్, మురారిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పత్తి శ్రీనివాసులు, తుమ్మలపెంట సుధాకర్, జూటూరు రవి, మాలేపాటి వెంకటసుబ్బయ్య(బీమా), కొలిశెట్టిశివప్రసాద్, మాలేపాటి సురేష్‌బాబు, సురేష్, తుమ్మలపెంట సురేష్‌బాబు,కోటా శ్రీధర్, మధు,పుల్లయ్య, వల్లంకొండు నాగరాజు, తులసి సుమంత్, కొలపర్తి హేమంత్‌గుప్తా తోపాటు పత్తి రమాదేవి, కొలిశెట్టి రుక్మిణి,అనురాదా పలువురు మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా కేవి.సుబ్బారావుకు ఘన సన్మానం

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త:**





గత 6 సంవత్సరాలుగా బద్వేలు పట్టణంలో ఆర్యవైశ్య వర్తక సంఘంకమిటి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ అలాగే అమ్మవారిశాలను అన్నివిధాలుగా కమిటి సభ్యుల ఆధ్వర్యంలో పలువురి దాతల సహకారంతో అభివృద్ది చేయడంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు సుబ్బారావు సేవలు అభినందనీయమని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతిలలిత, మా జీ అధ్యక్షురాలు చింతకుంట ధన లక్ష్మి, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, సముద్రాల పద్మావతి, శిరీష,తోపాటు పలువురు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు గుబ్బా వెంకటసుబ్బయ్య, పైడిమర్రి సురేష్‌బాబుతోపాటు పలువురు కమిటి సభ్యులు బుధవారం వారి స్వగృహం వద్ద వారి కుటుంబ సభ్యులను గజమాలతోసత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్యవైశ్యవర్తక సంఘం సెక్రటరీ కొలిశెట్టి నాగరాజు, ట్రెజరర్‌చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్లు చలమయ్య, వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలు సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్‌తో పాటుపలువురు కమిటి సభ్యులు ఆలయ మర్యాదలతో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు సతీమణి శర్వాణి కుటుంబ సభ్యులను ప్రత్యేక బ్యాండు మేళతాళాలతో అమ్మవారిశాలకు ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలునిర్వహించారు. వారికి దారివెంట పలువురువ వ్యాపారులు శాలువా, పూలమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## అరటి ఉత్పత్తుల తయారీలో మెళకువలు నేర్చుకోవాలి

**పులివెందుల రూరల్, అక్టోబరు 9, ప్రభాతవార్త ః**



అరటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో మెళకువలు నేర్చుకోవాలని శిక్షణ సమన్వయకర్త, ఇంజినీరు నజ్మా అన్నారు. పులివెందులలోని ఆహారవిజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల పరిధిలోని చిన్న రంగాపురంలో బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల గ్రాండ్9 అరటి రకం చిప్స్ తయారీకి అనుకూలం అని తెలిపారు. అరటి నుండి స్మూతీ, చిప్స్, అరటితో మిల్లెట్‌కేకు తయారీ చేయు విధానాలు చిన్నరంగాపురం గ్రామస్థులకు తెలిపారు. కళాశాల విద్యార్థులు అరటిపండుతో మిల్క్‌షేక్ చేసి చూపించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు డాక్టర్ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలలో అరటిమీద చేసిన విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నివేదిత, ఎన్.వి.సుబ్బారెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, రైతులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంకాలమ్మ ఆలయంలో దుర్గా హోమం

**పులివెందుల, అక్టోబరు 9, ప్రభాతవార్త ః**



పులివెందులలోని అంకాలమ్మ ఆలయంలో బుధవారం దుర్గాహోమం నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుండి ఆలయంలో అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కాశీభట్ల గోపీనాథ్‌శర్మ పర్యవేక్షణలో వేద విద్యా ప్రవీణ్ సతీష్ శ్రీకాంత్ శాస్త్రిల ఆధ్వర్యంలో ఈ హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీసరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బండి మల్లారెడ్డి భక్తాదులకు ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ తిరుమలశెట్టి వెంకట నాగేంద్ర ప్రసాద్, ఆలయ ఈవో కె.వి.రమణ, ఆలయ ప్రధాన అర్చకులు రోళ్ల సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె ఐటీఐలో సరస్వతిపూజ

**వేంపల్లె, అక్టోబరు 9, ప్రభాతవార్త ః**



వేంపల్లెలోని శ్రీకందుల ఓబుళరెడ్డి ఛారిటీస్ ఐటీఐలో బుధవారం సరస్వతిపూజ ఘనంగా నిర్వహించారు. ఆయా ట్రేడ్‌లలోని విద్యార్థులు పాల్గొని సరస్వతి దేవికి పూజలు చేశారు. ప్రిన్సిపల్ ప్రసాదరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రభాకర్‌నాయుడు, చంద్రశేఖర్, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, అమర్‌నాథరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవిమాత బిందెసేవ

**వేంపల్లె, అక్టోబరు 9, ప్రభాతవార్త ః**



వేంపల్లెలో 119 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేంపల్లెలో ఆర్యవైశ్యులు బిందెసేవ కార్యక్రమం జరిపారు. ఆర్యవైశ్య యువత ఉసవాపం ఉండి అమ్మవారిశాల నుండి బయలుదేరి శివాలయంలో అమ్మవారిని అలంకరించుకని, వాసవిమాత బిందెలోని జలంతో బయలుదేరి గ్రామ వీధులలో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఆలయంలో రాత్రి అమ్మవారిని సరస్వతిదేవిగా తీర్చిదిద్ది భక్తులకు దర్శింపచేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి, తదితరులు పాల్గొన్నారు.

## కడప-బెంగళూరు రైల్వే మార్గంపై ముఖ్యమంత్రికి తులసిరెడ్డి లేఖ

**వేంపల్లె, అక్టోబరు 9, ప్రభాతవార్త ః**

రాయలసీమ ప్రాంత రైతుల, వినియోగదారుల, అన్నివర్గాల ప్రజల సమగ్రాభివృద్ధికి 2008-09 రైల్వేబడ్జెట్‌లో మంజూరైన కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు బ్రాడ్‌గేజ్ రైలుమార్గంపై ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన వేంపల్లెలో లేఖలోని విషయాల గురించి తెలిపారు. ఈ రైలు మార్గం 255.40 కిలోమీటర్లు ఉండగా ఇందులో 205 కిలోమీటర్లు ఏపీలోను, 50.40కిలోమీటర్లు కర్ణాటక రాష్ట్రం నిధులతో 50శాతం కేంద్ర ప్రభుత్వం, 50శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించే షరతులతో మంజూరైందన్నారు. అప్పట్లో రూ.3038కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారని తెలిపారు. నాలుగుదశల్లో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా కేవలం మొదటి దశ కడప నుండి పెండ్లిమర్రి వరకు మాత్రమే రూ.351కోట్లు ఖర్చు పెట్టి నిర్మాణం పూర్తి చేశారన్నారు. ఇందులో ఏపీ వాటాగా గత కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాలు నిధులు చెల్లించాయని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన నిధులు చెల్లించని కారణంగా రైల్వే శాఖ పనులు నిలిపి వేసిందన్నారు. అంతేకాక ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ మీదుగా నూతన రైల్వే లైను మంజూరు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు నాయుడు ఈ విషయమై దృష్టి సారించి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ నిధులు వెంటనే చెల్లించి రైల్వేశాఖ పనులు పున:ప్రారంభించేటట్లు కృషి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## అనాథ యువకుడికి అంత్యక్రియలు

**కాశినాయన, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**

కలసపాడు మండలంలోని కరణంవారిపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరయ్య (23)కు అమ్మ,నాన్న లేరు. ఇతను బంధువుల సహకారంతో బ్రతుకు జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇతని గుండె కురంధ్రం పడి ఆరోగ్యం క్షీణించంతో వివేకానంద ఫౌండేషన్ ఆశ్రమంలో చేర్పించారు. రాను రాను ఆరోగ్యం క్షీణించిబుధవారం మృతి చెందారు. మృతునికి వివేకానందం ఆశ్రమం వారు అంత్యక్రియలు నిర్వహించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

**జమ్మలమడుగు, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జమ్మలమడుగు సీఐటీయూ కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షుడు జి.దాసులు తెలిపారు. ఈసందర్భంగా వారు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫీకి మెమోరాండం అందజేశారు. శానిటేషన్ కార్మికులకు జీవో నెంబరు 549 ప్రకారం రూ.16వేలు వేతం ఇవ్వాలన్నారు. నెలకు 4 వీక్లీ ఆఫ్‌లు అలాగే ఏడాదికి 15 క్యాజువల్ లీవులు మంజూరు చేయాలని కోరారు. వర్కర్లపైన దౌర్జన్యం ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్ పీరాపై కఠిన చర్యలు తీసుకొని వెంటనే విధుల నుంచి తొలగించాలని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని తెలిపారు. 14 రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరించకపోతే వర్కర్లను, కార్మికులను కలుపుకొని ఆసుపత్రి ముందు ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు శేఖర్ స్వామి, భీమా తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో దళిత బాలికను మానభంగం చేస్తే పరామర్శించడానికి కూడా సమయం లేని డిప్యూటీ సీఎం

**జమ్మలమడుగు, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురంలో 2 రోజుల క్రితం ఒక దళిత 16 సంవత్సరాల మైనర్ బాలికను టీడీపీ వ్యక్తి జాన్ ఆటోలో తీసుకెళ్లి మానభంగం చేస్తే కనీసం పరామర్శించే సమయం కూడా లేని నీవు నీ సొంత నియోజకవర్గమైన పిఠాపురంలో దళితులకు నువ్వు ఇచ్చే గౌరవం ఇదేనా అని వైసీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు మండిపడ్డారు. ఏపీలో జరుగుతున్న చిన్నారి బాలికను మొదలుకొని వృద్దుల వరకు స్త్రీలకు రక్షణ లేకుండా పోతోందని వెంటనే చర్యలు తీసుకొని న్యాయం జరిగేలా చేయాలని డిమాండ్ చేశారు.

## అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే

**బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



దసరా ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన అమ్మవారిశాలలోని అమ్మవారిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మఠం ఆర్య వైశ్యులుఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరంఅమ్మవారిశాల అధ్యక్షులు కృష్ణమూర్తి, యువజన సంఘం అధ్యక్షులు యాదాళ్ల వెంకటసుబ్బయ్యలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పబ్బతి నాగేశ్వరరావు, శేషయ్య, సుంకు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కడప తాలూకా హెడ్ కానిస్టేబుల్‌పై కేసు

**కడప క్రైం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వి.ఎం.బాషా, మరో ఇద్దరు బొమ్మిశెట్టి రామకృష్ణ, రామాంజనేయరెడ్డిలతో కలిసి తనకు సంబంధించిన ఆస్తి వ్యవహారంలో తనను మోసం చేశారనీ, బెదిరించారని బాధితుడు గతంలో కడప శాస్త్రినగర్ నివాసి అయిన బందా శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు నకిలీ డాక్యుమెంట్లతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారనీ, ఒక వ్యక్తి స్థానంలో మరో వ్యక్తిని చేర్చి రిజిస్ట్రేషన్‌ను చేయించి తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాథమికంగా విచారించిన కడప తాలూకా పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా బాషాపై గతంలో మూడు ఎర్రచందనం కేసులతో పాటు ఈ ఏడాదిలో కడప తాలూకా పీఎస్‌లో భూ కబ్జా కేసు ఉందని పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

## అధికారులు ఉన్నట్లా.. లేనట్లా..

### - మురికినీరు పారుతున్నా పట్టించుకోని వైనం

**రాయచోటి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన వీరబల్లిలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో గ్రామంలోని మురికి నీరంతా రోడ్డుపై పారుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా మురికి నీరు సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆ రహదారిన వెళ్లే పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు పోస్టాఫీస్, బ్యాంక్ అధికారులు, ప్రజలు ఆ మురికి నీటిని తొక్కుతూ వెళ్తున్నామని మండల స్థాయి అధికారులకు, పంచాయతీకి తెలిపినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు రానే వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని మురుగునీటిని రహదారిపై ప్రవహించకుండా చూడాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## తహసీల్దార్ ఇక్బాల్‌కి ఘనంగా సన్మానం

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**



సద్భావన సేవా సంఘం సంస్థ ఆధ్వర్యంలో జిన్నా రోడ్డులోని ఎంపీజే కార్యాలయంలో దువ్వూరు నూతన తహసీల్దారుగా నియమితులైన ఎండి ఇక్బాల్‌ను ఘనంగా సన్మానించారు. సంస్థ గౌరవ అధ్యక్షులు పుల్లారెడ్డి, ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, మన ప్రజా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్, కింగ్ బాషశాలువాతో సన్మానించారు. అనంతరం సన్మాన సభ కార్యక్రమంలో ఇక్బాల్ మాట్లాడుతూ 1989లో నుంచి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఎంతో నమ్మకంతో పనిచేస్తూ ప్రజల మన్ననలు పొంది అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చిన నాకు ఈరోజు ప్రభుత్వం దువ్వూరు తహసల్దార్‌గా నియమించడం జరిగిందని పదవులు, హోదాలు వస్తు ఉంటాయి కానీ, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు తీరుస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా రంగము అలవర్చుకున్నప్పుడే జీవితం సాఫల్యం అవుతుందన్నారు. ముఖ్యంగా యువత మంచి చదువులు చదివి మంచి ఉద్యోగస్తులై ప్రజలకు సేవ చేయాలని, కానీ ఈ మధ్య యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు మెజార్టీ శాతం బానిసలు అవుతున్నారు. కావున యువత ఫీచర్‌ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. మరియు తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచి వారిని సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. ఈ సన్మాన సభ కార్యక్రమం ఏర్పాటు చేసిన సద్భావన సేవా సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు టప్పా మహబూబ్ షరీఫ్, చంద్రశేఖర్, సయ్యద్, ఇస్మాయిల్, సత్తార్, రహమతుల్లా, అధ్యక్షులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులమీద జగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలి

**కడప కార్పొరేషన్, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



క్రైస్తవుల మీద జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని క్రైస్తవుల హక్కుల పరిరక్షణ దళం పౌండర్ పాల్ ప్రసాద్ తెలిపారు. బుధవారం నగరంలోని రెడీమర్ చర్చిలో క్రైస్తవుల హక్కుల పరిరక్షణ దళం 5వ వార్షికోత్సవానికి హాజరై ప్రసంగించారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అందెల సురేష్, డేవిడ్‌లు హాజరై మాట్లాడుతూ క్రైస్తవుల హక్కులు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.బి.సుధీర్, డా.సైలీస్, డా.శేషం ప్రసాద్, దైవజనులు లాజరస్, ఆనంద్ బాబి, ప్రెసిడెంట్ ఇల్లూరి సురేష్, జాకెట్ రాజు, రవికుమార్, దానం, బోసం ప్రభుదాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

## వైవీయూ పాలకమండలి సభ్యులు కొండపల్లి సుబ్బారావుకు ఘన సన్మానం

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త:**

ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు, వైవీయూ పాలకమండలిసభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు సేవలను గుర్తించి హైదరాబాదులోని మనం ఫౌండేషన్‌వారు మహాత్మగాంధీ శాంతి సేవా రత్న నంది అవార్డు అలంకరించిన కొండపల్లి చిన్న సుబ్బారావును, అలాగే చీదళ్ల వెంకటసుబ్బయ్య సేవలను గుర్తించి వారికి ఇచ్చిన నంది అవార్డులను పురస్కరించుకుని బుధవారం శ్రీ కోదండరామస్వామి దేవాలయంసన్నిధిలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి భవిష్యత్తులో ఇలాంటి పురస్కారాలు మరెన్నో పొందాలనిఆలయ కమిటి అధ్యక్షులు పేర్ల జనార్థన్ రావు, సెక్రటరీ బచ్చునాగేశ్వరరావు,ట్రెజరర్ కొండపల్లి సాయికుమార్, ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యం, తులసి సుబ్బారావు, వల్లంకొండు సత్యనారాయణ, సుబ్బారావు, టీచర్ శ్రీరాములు,గొంట్ల శ్రీనివాసులు, అంజన్‌కుమార్, సముద్రాల లక్ష్మినరసింహారావులతోపాటు పలువురు వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## డిసీసీ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ప్రారంబించిన ఎమ్మెల్యే

**బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



స్థానిక బ్రహ్మంగారిమఠంలో బుధవారం నూతన డిసిసి బ్యాంక్‌కార్యాలయాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు అనంతరం ఆయన బ్యాంక్‌లోని లాకర్‌ను పరిశీలించి ఖాతాదారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులనుద్దేశించి మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరూ బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అలాగే ముఖ్య కార్యనిర్వాహణాధికారి రాజామణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండేలా బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగిందని, ఇతర బ్యాంక్‌లకన్నా తమ బ్యాంక్‌లో అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ముడుమాల పోలిరెడ్డి, శ్రీయపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సాంబశివారెడ్డి, శ్రీను, పూజ శివయ్యయాదవ్, మేకల సుధాకర్ యాదవ్, బోలా శ్రీను, బి.మఠం బ్రాంచ్ మేనేజర్ నవీన్, అసిస్టెంట్ మేనేజర్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

## గోపవరం తహశీల్దారుగా త్రిబువన రెడ్డి

**గోపవరం, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**



గోపవరం మండల తహశీల్దారుగా బుధవారం త్రిబువన రెడ్డి బాధ్యతలుచేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన పులివెందుల డివిజన్ వేముల నుంచి ఇక్కడకు వచ్చారు. అలాగే ఇక్కడ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఉదయ భారతి బద్వేలు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయిన విషయం విధితమే.ఈ సందర్భంగా నూతన తహశీల్దారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సిబ్బందితో కలసి కృషిచేస్తానని, మండలంలో నెలకొన్న కీలక సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

## మండలంలో భర్తీ కానీ కార్యదర్శుల పోస్టులు

**కలికిరి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

కలికిరి మండలంలోని పారపట్ల, మహల్, అద్దెవారిపల్లి పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శుల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఇటీవల ప్రభుత్వం ఒకే పంచాయతీలలో 5 సంవత్సరాలు పూర్తయిన కార్యదర్శులను అక్కడి నుంచి వేరే పంచాయతీలకు బదిలీ చేయడం జరిగింది. దీంతో మహల్, అద్దెవారిపల్లి, పారపట్ల పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులను ప్రభుత్వం బదిలీ చేసింది. కానీ వారి స్థానంలో కొత్త కార్యదర్శులను నియమించలేదు. అంతేకాకుండా ప్రభుత్వం కలికిరి మండల పంచాయతీలకు కొత్తగా నియమించిన కార్యదర్శులు ఆ పంచాయతీలలో బాధ్యతలు చేపట్టలేదు. కొత్త పంచాయతీల కార్యదర్శులు బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్న అయోమయ పరిస్థితి నెలకొంది. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి మండలంలోని 3 పంచాయతీలకు కొత్త కార్యదర్శులను నియమించి కలికిరి మండలంలోని పంచాయతీలకు కార్యదర్శులు విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా ఇటీవల ప్రభఉత్వం పల్లెల్లో పండుగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఆ పండుగ విజయవంతం కావాలంటే పంచాయతీలలో కార్యదర్శులు బాధ్యతలు చేపట్టి స్థానిక సర్పంచులతో సమన్వయం చేసి సర్పంచుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతం చేయాల్సి ఉంది.

## దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



**కడప క్రైం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

కడప నగరం మోచంపేటకు చెందిన షేక్ అక్బర్(26) అనే వ్యక్తి డిగ్రీ వరకు చదువుకొని చెడు అలవాట్లకు బానిసై రాత్రివేళల్లో దొంగతనాలు అలాగే ఒంటిగా వెళ్తున్న మహిళల మెడలో చైన్లు దొంగలిస్తూ ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై టుటౌన్, చిన్నచౌకు, వల్లూరు తదితర పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని దర్యాప్తులో భాగంగా బుధవారం అతన్ని ఔటర్ రింగు రోడ్డు వద్ద చిన్నచౌకు సీఐ తేజమూర్తి తన సిబ్బందితో పట్టుకుని విచారించగా నేరాలు ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రఊూ ఏ.6.5లక్షలు విలువైన సుమారు 135 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన ఎస్సై రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, శివకుమార్, పోలీసులు ఖాదర్ హుసేన్, ఓబులేసు, రంతు బాషా, సుధాకర్, నాగరాజు, గోపాల్, ఉమామహేశ్వరీలను అభినందించారు.

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ



**రామాపురం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

మండలంలోని నిరుపేదలందరికీ నివాస స్థలాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రి సుమిత్ర ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రామాంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైనా నేటికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని నిరుపేద దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎంతో మంది కటిక పేదరికంతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న అర్హులైన పేదలకు నివాస స్థలాలు, ప్రతి కుటుంబానికి 3 ఎకరాలు సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు సురేంద్ర, మహిళా సమాఖ్య మండల నాయకురాలు సుబ్బమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బాల సదన్ తనిఖీ

**కడప లీగల్, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

కడప అక్కాయపల్లెలో ఉన్న బాలసదన్‌ను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ప్రసంగించారు. విద్యార్థినిల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# గుండెజబ్బుల పట్ల నిర్లక్ష్యం వద్దు

**వైద్యనిపుణులు డాక్టర్ మంజునాథ్‌బాబు**



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

ప్రాణాంతకమైన గుండెజబ్బుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా ఉండవద్దని అవగాహన, అప్రమత్తం అవసరమని నారాయణ హృదయాలయ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మంజునాథ్‌బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్‌తో కలసి ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మనిషి శారీరక శ్రమకు దూరమై తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. నిద్ర సమస్య కూడా అధికమైందన్నారు. తాత్కాలికంగా గుండెజబ్బుల భారిన పడే వారిసంఖ్య రోజు రోజుకు పెరుగుతోందన్నారు. బాస్ ఆధ్వర్యంలో కలసి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో 16ఉచిత గుండె వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. ఈ శిబిరాలకు రోగులు తరలివచ్చి పరీక్షలు చేయించుకొన్నారన్నారు. ప్రతి శిబిరంలో 10నుంచి 15శాతం మందికి గుండెజబ్బులు ఉన్నట్లు నిర్ధారణ జరిగిందన్నారు. ఇప్పటి వరకు 5వేల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. 700మందికి గుండెజబ్బులు ఉన్నట్లు గుర్తించి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. శారీరక శ్రమల ద్వారా బిపి, షుగర్‌లను కంట్రోల్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలోన వైద్యశిబిరం ఇన్‌చార్జ్ రమేష్, మనోజ్‌తో పాటు బాస్ నాయకులు రెడ్డప్ప, బురుజు రెడ్డిప్రసాద్, తలారి క్రిష్ణ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాన్షీరామ్ వర్ధంతి వేడుకలు

**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

కాన్షీరామ్ 18వ వర్ధంతి వేడుకలు బుధవారం బహుజన యువసేన ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నందు ఘనంగా నిర్వహించారు. బివైఎస్ అధ్యక్షులు పునిత్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పునిత్ మాట్లాడుతూ కాన్సీరామ్ దేశంలో మొట్టమొదటిసారిగా జ్యోతిరావు పూలే, షాహు మహరాజ్, చత్రపతి శివాజి, పెరియార్, అంబేద్కర్ ప్రబోదాలను రాజ్యాధికారంపై నడిపి ఎన్నో విజయాలను సాధించిన గొప్ప వ్యక్తి అన్నారు. నిత్యం బహుజనుల కోసం రాజ్యాధికారం అందించాలని కోరిన వ్యక్తి అన్నారు. ప్రతి ఒక్కరూ కాన్షిరామ్ ఆశయాల నిర్వహణకు కృషి చేయాలన్నారు. కాన్సీరామ్ నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశికుమార్, వేణుగోపాల్, ఆది,బాలక్రిష్ణ, జగదీష్, శయన్స్, సాధిక్, నందీష్, బాబ, వినయ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

## రూ.3కోట్లుతో ఎన్ఆర్ఈజిఎస్ పనులు

**ఎండిఓ మస్తాన్ వల్లి**



**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

మదనపల్లె రూరల్ మండలంలో ఎన్ఆర్ఈజిఎస్ కింద వివిధ రకాల పనులు చేపట్టేందుకు రూ.3కోట్లు మంజూరు అయినట్లు ఎంపిడిఓ మస్తాన్‌వల్లి తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పథకం కింద పనులు చేపట్టేందుకు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఈ నెల 14నుంచి 20వరకు పల్లెపండగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధిహామీ సమన్వయ శాఖల అధికారులతో గ్రామాల్లో పండగ పంచాయితీ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గత ఆగస్టు నెలలో గ్రామసభలు నిర్వహించి వివిధరకాల పనులు చేపట్టేందుకు తీర్మాణాలు చేయడం జరిగిందన్నారు. పల్లెపండగ పంచాయితీ వారోత్సవాల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో భూమి పూజలు, శంకుస్థాపన ద్వారా పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు.

## నిమ్మనపల్లె ఎంపిడిఓగా పరమేశ్వర్‌రెడ్డి బాధ్యతలు



సన్మానిస్తున్న దృశ్యం

**నిమ్మనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

నిమ్మనపల్లె ఎంపిడిఓగా పరమేశ్వర్‌రెడ్డి గత రెండురోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా కలకడ నుంచి నిమ్మనపల్లెకు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ప్రజాసమస్యలు సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి చేపడుతామని చెప్పారు. నూతన ఎంపిడిఓ బాధ్యత సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు రమణ, బిసి పార్లమెంటు అధికారి లక్ష్మన్న, మాజీ ఎంపిపి పారిజాత మల్లికార్జున, నిమ్మనపల్లె మాజీ సర్పంచ్ శ్రీరాములు సన్మానించారు. గ్రామ కార్యదర్శి వెంకటరమణారెడ్డితో పాలు పలువురు అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

## వెంగంవారిపల్లె గ్రామ కార్యదర్శిగా నాగభూషణం

**నిమ్మనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

మండలంలోని వెంగవారిపల్లె గ్రామ కార్యదర్శిగా బుధవారం నాగభూషణం పదవీబాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో రిపోర్టుచేసి మధ్యాహ్నం వెంగంవారిపల్లె సచివాలయంలో విధుల్లో చేరారు. ఇతని చేరికపై మాజీ ఎంపిపి అంగజాల పారిజాత మల్లికార్జున హర్షం తెలిపారు. ఇతను సోమల మండలం తమ్మినాయునిపల్లె పంచాయితీ నుంచి బదిలీపై వచ్చారు.

## నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

**సిపిఎం నాయకులు డిమాండ్**



బాధితులతో కలసి సందర్శించిన దృశ్యం

**కురబలకోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలసి ముదివేడుప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ముదివేడు రిజర్వాయర్ నిర్మించాలని తలపెట్టి అనేక అక్రమాలకు పాల్పడి రైతులను ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పోరాట ఫలితంగా ముంపుకు గురయ్యే భూములను ఇండ్లు గుర్తించడం కోసం ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించి అవార్డు కూడా ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. దాదాపు 780ఎకరాల భూములకు రూ.108కోట్లు నష్టపరిహారం చెల్లించాలని ప్రకటించినా అది అమలకు నోచుకోలేదన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల పరిధిలోని ఐదు గ్రామాలు పూర్తిగా ప్రాజెక్టు వల్ల మునిగిపోతాయని ఇంతవరకు కూడా నష్టపరిహారం ఒక్క రుపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. భూముల్లో మట్టిని తవ్వేసి ప్రాజెక్టుకు వాడుకోవడం వల్ల ఆ భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణ సంస్థ రైతులకు లీజు చెల్లిస్తామని చెప్పి మోసంచేసిందని ఆయన ఆరోపించారు. రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, రైతులు బాలక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగళ్ళు సెక్రటరీగా ఉదయ్‌కుమార్

**కురబలకోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**



కురబలకోట మండలంలోని కీలకమైన అంగళ్ళు గ్రామ సెక్రటరీగా టి.ఉదయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అంగళ్ళు గ్రామ సెక్రటరీగా ఇదివరకు పనిచేసిన ఎంజిటి ప్రసాద్ పదోన్నతిపై గంగవరం ఈఓఆర్‌డిగా బదిలీపై వెళ్లారు. అనంతరం కురబలకోట గ్రామ సెక్రటరీగా శేషగిరికుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. వాయల్పాడు నుంచి ఉదయ్‌కుమార్ అంగళ్ళు గ్రామ సెక్రటరీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపడుతానని తెలిపారు.

## స్టోర్ డీలర్ మృతి

**కురబలకోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

మండలంలోని తూగువారిపల్లెకు చెందిన ప్రభుత్వ చౌకదుకాణ డీలర్ రామచంద్రారెడ్డి బుధవారం మృతి చెందారు. ఈయన టిడిపి కార్యకర్త అనారోగ్యంతో బాదపడుతూ మృతి చెందాడు. ఆయన మృతిపట్ల సహచర డీలర్లు, రెవెన్యూ సిబ్బంది కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

**ముద్దనూరు, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**



ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన గుండి నాగేంద్ర 22 సంవత్సరాల యువకుడు బుధవారం నాడు ముద్దనూరు-కొండాపురం రైలు మార్గంలోని రైలు పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దనూరులోని చింతకుంట గ్రామానికి చెందిన గుండి నాగేంద్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చింతకుంట చింతకుంట సమీపంలో ఉన్న రైలు పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

# రూ.90కోట్ల నిధులతో అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**నిమ్మనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

నియోజకవర్గంలో రూ.90కోట్లతో రోడ్లు, మురుగు కాలవులకు ప్రత్యేక ప్రణాళికలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో రూ.18లక్షలతో వారపుసంత నిర్మాణపనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వాసుల చిరకాల సమస్యలైన టిటిడి కళ్యాణమండపం, అసంపూర్తిగా ఉన్న షాదీమహాల్ పనులు, డిగ్రీ కళాశాల, నూతనంగా బస్టాండుతో పాటు పది గ్రామ పంచాయితీల్లోని అన్ని గ్రామాల్లో సిసిరోడ్లు ఇదివరకు పక్కాగృహాలు లేని నిరుపేదలందరికి రూ.4లక్షలు నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. అదే విధంగా ప్రస్తుతం మహిళలకు బ్యాంకుల ద్వారా ఇస్తున్న రూ.20లక్షల నుంచి ప్రతి గ్రూపుకు రూ.40లక్షలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాబార్డు డిడిఎం గోపాల్, బిడిఎం మూర్తి, డిడిఎం విజయవిహారి, గాంధీ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ రమాదేవి, గ్రామ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, తహశీల్దార్ ధనాంజనేయులు, విద్యుత్ఏఈ నాగరాజ, ఏపిఎం మురళి, జిల్లా మాజీ కోప్షన్ సభ్యులు సుధాకర్‌రావు, పార్లమెంటు మీడియాకోఆర్డినేటర్ రాజన్న, పార్లమెంటు బిసి అధికార పార్టీ కార్యదర్శి లక్ష్మన్న, మాజీ ఎంపిపిలు రెడ్డప్పరెడ్డి, పారిజాత మల్లికార్జున, రామక్రిష్ణ, మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమణ, జయరామ్, ఆసుపత్రి మాజీ ఛైర్మెన్ శ్రీపతి, టిడిపి నాయకులు మల్లప్ప, ఖాసిం, షఫి, శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, నరేంద్ర, మాజీ సర్పంచ్‌లు శ్రీరాములు, దామోదర్‌రెడ్డి, లక్ష్మన్న, రెడ్డప్ప, రఫి, జనసేన నాయకులు రామాంజనేయులు, కళ్యాణ్, చంద్రా, బిజెపి నాయకులు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యేకు అఖండ స్వాగతం :-**

వారపుసంత ప్రారంభానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప నిమ్మనపల్లెలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వివిధ రకాల వాయిద్యాలతో, గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం భారీ సంఖ్యలో అన్నదానం నిర్వహించారు.

## దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్తః**

విజయదశమి సందర్భంగా దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక సీఐ యుగంధర్ అన్నారు. బుధవారం సీఐ మాట్లాడుతూ డీజే సౌండ్ సిస్టమ్ నిషేదమని, ఎక్కడైనా సంబరాలు శతి మించితే కేసులు నమోదుచేస్తామని స్పష్టం చేశారు. సెలవులకు ఊర్లకు వెలుతున్న ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే వారి ఇళ్ల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తలుపు తడితే ఫోటోలు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. రాత్రి వేళల్లో 9 గంటల పైన పట్టణ పురవీధుల్లో ద్విచక్రవాహనాల్లో చక్కెర్లు కొడితే అటువంటి ఆకతాయిల పని పడుతామని సీఐ హెచ్చరించారు.

## ఘనంగా శ్రీకాన్సీరామ్ 18వ వర్ధంతి



చిత్రపటానికిపూలమాల వేసి వర్ధంతిని జరుపుకుంటున్న బాస్‌నాయకులు

**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్తః**

స్థానిక బాస్ కార్యాలయంలో బాస్ నాయకులతో కలిసి బాస్ జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు చిత్రపటానికి పూలమావేసి ఘనంగా నివాలులు అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తరతరాలుగా బహుజనులను అణచివేస్తున్న కుల వివక్షను ఎదిరించి బహుజన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించిన మహానేత బహుజన రాజకీయ వ్యూహకర్త మాన్యశ్రీ కాన్సీరామ్ అని కొనయాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్న బహుజన రాజ్యం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన మహోన్నత ఉద్యమ శిఖరం మాన్యశ్రీ కాన్సీరామ్ అని తెలిపారు. అంబేద్కర్ రాసిన కుల నిర్మూలన పుస్తకాన్ని చదివి దాని ప్రభావంతో ఉద్యోగానికి రాజీనామా చేశారని, అలాగే వివాహం కూడా చేసుకోకుండా అంబేద్కర్ ఆశయసాధనకు నిరంతరం పోరాడిని గొప్ప మహనీయుడు కాన్సీరామ్ అని తెలిపారు. బీఎస్పీ పార్టీ అనతి కాలంలోనే దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర మైన ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిందని అలా నాలుగుసార్లు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠంపై బలహీన వర్గానికి చెందిన దళిత మహిళ మాయావతిని కూర్చోబెట్టి పీడిత వర్గాల ప్రజలకు రాజ్యాధికారాన్ని అందించారని కావున కాన్సీరామ్‌ని స్పూర్తిగా తీసుకుని బహుజన వర్గాల ప్రజలందరూ ఏకమై రాజ్యాధికారం వైపు ప్రయాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీసీ నాయకులు మల్లికార్జున, హరినాధ, గురవయ్య, నాగేశ్వరరావు, సతీష్, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్తః**

ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పీలేరు సర్కిల్ పరిధిలోని పీలేరు మండలం-6, కలకడ-2, కేవి.పల్లె-1 మొత్తం 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తు గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందన్నారు. దరఖాస్తులు ఈనెల 11వ తేదీ సాయంత్రం 7గంటలవరకు పొడిగించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో రూ.2లక్షలు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ చార్జిగా చెల్లించాల్సి ఉంటుందని గడువు పెంచినట్లు తెలిపారు. ఒక వ్యక్తి ఒక షాపుకు ఎన్ని దరఖాస్తులైనా దరఖాస్తులు సమర్పించవచ్చునని ఒక వ్యక్తి లాటరీలో ఒక వ్యక్తి ఎన్ని షాపులైనా దక్కించుకోవచ్చునని చెప్పారు. లాటరీ ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి అపోహలకు తావు లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 14న రాయచోటి- మదనపల్లె మార్గంలోని అజయ్ కన్వెన్షన్ హాలుకు రావలెను.. ఇప్పటి వరకు 9 మద్యం దుకాణాలకు 65 దరఖాస్తులు స్వీకరించడమైందన్నారు. ఒక వేళ దరఖాస్తు సమర్పించుటకు లేదా లాటరీ ప్రక్రియ రోజుగానీ అభ్యర్థి రాలేని పక్షంలో ఒక అఫిడవిట్ సమర్పించి అతని తరఫున వేరే వ్యక్తిని పంపవచ్చని పేర్కొన్నారు. కావున ఆసక్తిగల అభ్యర్థులు మద్యం షాపుల కోసం దరఖాస్తులు సమర్పించవలసిందిగా కోరారు.

## గర్భస్త శిశువు సంరక్షణ బాధ్యత తల్లికే ఉంటుంది



గర్భిణీలకు, రొట్టె, పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్తః**

గర్భస్త శిశువు సంరక్షణ బాధ్యత తల్లికే ఉంటుందని ప్రతి గర్భిణీ ప్రమాదకర సూచనలపై అవగాహన కలిగి మేలైన ఆరోగ్యపరీక్షలతో తల్లి, బిడ్డ సంక్షేమానికి సహకరించాలని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తలపుల పీహెచ్‌సీలో గర్భవతులకు ఆరోగ్య సేవలు అందించారు. ప్రతి గర్భిణీకి ప్రధానమంత్రి సురక్ష మాతత్వ అభియాన్ ఆరోగ్యసేవల అవసరాన్ని వివరించారు. గర్భిణీగా ఉన్నప్పటి నుంచే శిశువుకు రక్షణ అందించడం తల్లిగా తాము పూర్తి అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వివరించారు. లక్ష్మీ ప్రసన్న సహకారంతో 22 మంది గర్భిణీలకు రొట్టె, పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కష్ణయ్య, కుసుమ ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, నాగవేణి, కుముద, ఆశ కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో గేదె మృతి

**పెండ్లిమర్రి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**



మండలంలోని రేపల్లె గ్రామంలో పంగా రేవితి అనే మహిళకు చెందిన గేదె బుధవారం పిడుగు పాటుతో మృతి చెందిందని బాధితులు తెలిపారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో గేదెపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె పాలను అమ్ముకొని జీవించే తమకు జీవనాధారం పోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్



**సిద్దవటం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలం భాకరాపేట సమీపాన ఉన్న పోలీసు పటాలంలో బుధవారం మహిళా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసు పటాలం ఇన్‌ఛార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు పటాలయంలో పోలీసు కుటుంబాల అమరులైన కుటుంబ సభ్యుల సమస్యలను పరిష్కారం చేయడానికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమరవీరుల త్యాగాలు మరువలేని విషయమని వారి కుటుంబ సమస్యలను పరిష్కారం చేయడానికి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయనవీనేల త్యాగాలు మరువలేని విషయమని వారి సమస్యల పరిష్కారమే మహిళా దర్బార్ పరిష్కార వేదికగా అమలు చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.విల్సన్, ఎస్.డి.ప్రసాద్, మహిళా వైద్యాధికారి దివ్యరాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌వీఈపీ పథకంతో మహిళలు లక్షాధికారులే




**తంబళ్లపల్లె, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల మహిళా సంఘాలు (ఎస్‌వీఈపీ) స్టార్టప్ విలేజ్ సెంటర్ ఫ్రెండ్షిప్ ప్రోగ్రాం ద్వారా భవిష్యత్తులో లక్షాధికారులు కావడం ప్రభుత్వ లక్ష్యమని ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో ఆరు మండలాల ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సీఆర్పీలు, వీవో లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు అన్నమయ్య జిల్లాలో పూర్తిగా వెనకబడిన తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఎంచుకున్నారని నాలుగేళ్ల పాటు ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు, తన స్థాయిలో అభివృద్ధి చేసుకునే వ్యాపారాల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించి భవిష్యత్తులో సీఎం చంద్రబాబునాయుడు ఆశించిన ప్రతి మహిళా లక్షాధికారి అయ్యేంత వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలు, సీఆర్పీలు, వీవో లీడర్లు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

## రసం పీల్చే పురుగుల నివారణకు తగు చర్యలు




**ముద్దనూరు, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**

ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గాలం సుబ్బరాయుడు పచ్చి మిరప తోటలో రసం పీల్చే పురుగుల ఉత్పతిని గమనించి వాటి ఉద్పతిని అరికట్టుటకు పసుపు రంగు జిగురు అట్టలను పెట్టియున్నారని అయితే వాటి ఉ ధృతి తీవ్రంగా ఉండటం వలన జిగురు అట్టలకు తెల్లదోమ, పచ్చదోమ, ఎపిడ్స్ మొదలగు రసం పీల్చు పురుగులు అట్టలకు అంటి ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరైతు సాగు చేసిన ఆయా పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు జిగురు అట్టలు మంచి ఉత్తమ పద్ధతి అని తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొని సహజ సిద్ధ వ్యవసాయం గురించి రైతులకు అవగాహణ కల్పించారు. రసం పీల్చే పురుగుల నివారణకు వావిలాకు కషాయం పిచికారి చేస్తే మంచి ఫలితము ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది ఆర్.రామ సుధ, రమణయ్య, ముని భూపాలుడు, శైలజ, శ్రీదేవి, యమున మరియు రైతులు, వ్యవసాయ మహిళా కూలీలు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది

**మైదుకూరు, అక్టోబర్ 09,ప్రభాతవవార్త :**

మండలంలోని అన్నలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఏడి కృష్ణమూర్తి మాట్లాడుతూ వివిధ పంటల్లో విత్తన శుద్ది మినుములో మేలైన రకాల ఎంపిక, జొన్నలు, కత్తెర పురుగు నివారణ గురించి కందిలో పురుగు నివారణ కొరకు ఇమిడాక్లోప్రి.ఎడ్ రెండు గ్రాములు లీటరు నీళ్లలో కలపి పిచికారి చేయాలన్నారు. అందుబాటులో ఎరువులు, యూరియా, పొటాష్‌లు రైతు సేవా కేంద్రాలలో లభ్యమవుతున్నాయి. తెల్ల పొటాస్‌లు రైతు సేవా కేంద్రాలలో లభ్యమవుతున్నాయన్నారు. తెల్ల పొటాషి 1493 రూపాలయలకు లభ్యమవుతున్నాదని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే పంటలలో సస్యరక్షన చర్యలు పాటించాలని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్దతులు కూడా పాటించాలని తెలిపారు. టమోటా, పంటలు వైరస్ తెగుళ్ల నివారణ కోసం మంచి మేలైన రకాల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమమంలో శాస్త్రవేత్త ఫిరోజ్ కేవికే, మండల వ్యవయాధికారి పి.ప్రసన్న, అన్నలూరు విఏఏ సిద్దమ్మ మరియు రైతులు పాల్గొన్నారు.



## జేఎన్‌టియు సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ఆదిత్య విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
జేఎన్‌టియు ఏ సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం జరుగుతున్న తేజవర్ధన్‌రెడ్డి ఇటీవల ఆది శంకరా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టియు ఏసౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటి క్రికెట్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందిస్తూ భవిషత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని కోరారు. కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు ఎన్.నాగ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, హెచ్‌ఓడిఎస్ వెంకట వరప్రసాద్ ఫిజికల్ డైరెక్టర్లు ఆర్.సురేంద్రబాబు అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

## సరస్వతీదేవి అలంకరణలోశ్రీపద్మావతిదేవి

**పీలేరు, అక్టోబరు 09 ప్రభాతవార్తః**
స్థానిక కోటపల్లెలో వెలసిన శ్రీపద్మావతీ ఆండాల్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వెలసిన శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిత్తూరు మార్గంలోని మోడల్ కాలనీలో యల్లమ్మ తల్లిని సరస్వతీదేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి అనంతరం ప్రత్యేక పూజలుచేసి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.





## సరస్వతిదేవి అలంకారంలో విజయదుర్గా

**సిద్దవటం, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
ఉప్పరపల్లి పంచాయతీ సాయినగర్‌లోని భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు సరస్వతి దేవి అలంకారంలో విజయ దుర్గ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విగ్రహ దాత పుత్తా రామభద్రయ్య కుమారులు పుత్తా నాగభూషణం, పుత్తా బాబు కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు అమర్‌నాథ్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంత్రోచ్చారణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



## శ్రీ దుర్గా దేవీ అలంకారంలో...

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 09, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వెలసిన సర్వమంగళ దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు శ్రీ దుర్గాదేవిగా అమ్మవారిని ప్రత్యేకంగా ప్రధాన అర్చకులు శ్రీహరిస్వామి అలంకరించారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, మంగళ హారతుల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులేశ్వరమ్మ, ఆలయ ధర్మకర్తలు గొర్ల మోహన్‌రెడ్డి, భూదేవమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

**మైదుకూరు, అక్టోబర్ 09,ప్రభాతవవార్త :**
మండల కేంద్రంలోని మైదుకూరు పట్టణ కేంద్రంలో దశరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శాలలో బుధవారం కన్యకా పరమేశ్వరి దేవి మూలవిరాట్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు ఆర్యవైశ్యులు జరిపించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలకు ఆర్యవైశ్యులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు శాలువాతో ఆయనను సత్కరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆర్య వైశ్య కమిటీ సభ్యులు పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



## జాతీయ స్థాయి ఖోఖో క్రీడలకు గౌతమి విధ్యార్థిని



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**
ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం సిఎస్ఈ(ఎస్ఐ అండ్ ఎంఎల్) విద్యార్థిని వి.లావణ్య జాతీయ స్థాయి ఖో ఖో క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ తెలిపారు. నెల్లూరు ఎన్‌బికేఆర్ఐఎస్‌టి కళాశాలలో జరిగిన జాతీయ సౌత్ జోన్ యూనివర్సిటీ క్రీడల జట్లు ఎంపికలో జేఎన్‌టీయూఏ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబర్‌లో కేరళలోని కేలికట్ యూనివర్సిటీలో జరిగే జాతీయ సౌత్ జోన్ యూనివర్సిటి క్రీడల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు రవీంద్రా రెడ్డి, డైరెక్టర్ శైలూష, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జాబీర్, యాకూబ్, అలీ, విజయమ్మ, ఫిజికల్ డైరెక్టర్ ఓబయ్య, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## సరస్వతిదేవి రూపంలో భద్రకాళీ, శ్యామలాంబ అమ్మవార్లు

**చిట్వేలి, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
దేవి శరన్నవ రాత్రి దసరా ఉత్సవాలలో భాగంగా 7వ రోజు బుధవారం పాత చిట్వేలిలోని శ్రీ భద్రకాళీ, స్థానిక శివాలయంలోని శ్రీ శ్యామలాంబ అమ్మవార్లు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చ, మహా మంగళహారతి, తదితర ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అమ్మవారి తిథి మూల నక్షత్రం సందర్భంగా పెద్దఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.



# సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి







**రాజంపేట అర్బన్, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**
శరన్నవ రాత్రి ఉత్సవాలు 6వ రోజు బుధవారం మూలా నక్షత్రంలో ముల్లోకాలను ఏలో జగజ్జనని ప్రత్యేక పూజలు అందుకుంది. సాంప్రదాయంగా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పసిడి బిందెలో కొలువైన వాసవీ మాతను శిరస్సుపై ఉంచుకొని లోక పావని కొలువైనట్లుగా భక్తులు మడిస్నానం చేసి బిందె సేవలో పాల్గొన్నారు. బిందె సేవలో దర్శణమిచ్చే అమ్మవారికి భక్తులు హారతీ, కర్పూరాలతో టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. భక్తీ పారవశ్యంతో యువకులు బిందె సేవ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం రాత్రికి చదువుల తల్లి సరస్వతి దేవిగా వాసవీమాత భక్తులకు దర్శణం ఇచ్చారు. పలువురు సరస్వతి అలంకారాన్ని పురస్కరించుకొని చిన్నారులకు విద్యాభ్యాసానికి కూడ శ్రీకారంచుట్టారు. మరోవైపు మన్నూరు ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో పురోహితులు కొర్రపాటి రవిమోహన్ అమ్మవారిని కాలరాత్రి అలంకారంలో తీర్చిదిద్దారు. భక్తులు ఆలయానికి శరన్నవ రాత్రుల ఉత్సవాల సంధర్భంగా పోటెత్తుతున్నారు.

# ఎగ్జిబిషన్‌లు సృజనాత్మక ఆలోచనలను చిగురింపచేస్తాయి

**కడప, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**
పిల్లల్లో సృజనాత్మక ఆలోచణలు చిగురింపచేయడానికి "స్పేస్ వీక్-2024" లాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కడప నగర సమీపంలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో, కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో, కేఎస్ఆర్ఎం విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఇస్రో స్పేస్ వీక్ 2024 ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా షార్ డిప్యూటి డైరెక్టర్ రమేష్ బాబు, ఏపీజీబీ జోనల్ ఆఫీసర్ ఎస్.ఎస్.మురళీ, షార్ ఎస్డిఎస్సీ జీఎం వి.కృతి వాసన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పేస్ వీక్ లాంటి ఎగ్జిబిషన్ వల్ల పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలు చిగురిస్తాయని అన్నారు. సరికొత్త ఆలోచనలు, శాస్త్ర సాంకేతికత పురోభివృద్ధి, పరిణామాలకు నాంది పలుకుతాయన్నారు. విద్యార్థుల్లో వెలిగే ప్రతి చిన్న పాటి ఐడియా కూడ వారీ ఆలోచన విధానం పరిశోధన వైను అడుగులు వేయడం సాధ్యం అవుతుందన్నారు. ఈ నెల 7వ తేది నుంచి 9వరకు జరిగిన వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమంలో భాగంగా స్పేస్-వెదర్ చేంజ్ అనే థీమ్‌తో వర్క్ షాప్, సైన్స్ ఎగ్జిబిషన్, ఎలక్ట్యూషన్, ఎస్సే రైటింగ్, షార్ట్ ఫిల్మ్, సైన్స్ నమూనాలు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేట్ అండ్ గవర్నమెంట్ స్కూల్స్ నుంచి 9948 విద్యార్థులు, 25మబంది ఇస్రో సైంటిష్టుల సహాయ సహకారాలతో విజయవంతం చేయడంపై జిల్లా కలెక్టర్ అభినందించారు. వివిధ అంశాలపై జరిగిన కాంపిటీషన్స్ విజేతలుగా నిలిచిన విధ్యార్థిని, విధ్యార్థులకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.ఉస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ టి.ఎన్ ప్రసాద్, కల్చరల్ క్లబ్ కోఆర్డినేట్ డాక్టర్ వీరశంకర్, కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ సురేష్ బాబు, కమిటి మెంబర్స్, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ అనంత పద్మనాభస్వామి శేషపాన్పు అలంకారంలో కోదండరాముడు

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం దసరా ఉత్సవాలను ఆలయ కమిటి అధ్యక్షులు పేర్ల జనార్ధన్ రావు, సెక్రటరీ బచ్చునాగేశ్వరరావు,ట్రెజరర్ కొండపల్లి సాయికుమార్, ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యంతో పాటు వివిధ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తంగి పవన్‌కుమార్ శర్మ, లక్ష్మినారాయణశాస్త్రి ల మంత్రోచ్చరణాల మధ్య ఘనంగానిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారు శ్రీ అనంత పద్మనాభ స్వామి శేషపాన్పు అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.అలాగే ఈ ఆలయంలో నిర్వహించిన తోటోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రత్యేక ఉభయదాతలుగా కీ.శే. యల్లనూరు శీనయ్య, సతీమణి ఆదిలక్షుమ్మ, వీరి కుమారులు వెంకటరమణ, సతీమణి హేమమాలిని, వెంకటమోహన్ సతీమణి మౌనిక ఉభయదారులకు స్వామివారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మదళ్లపల్లె సత్యం, సగళా నాగరాజ, బ్రహ్మాదండు వెంకటసుబ్బయ్య, యలకంటి సుబ్బరాయుడు, సతీష్, వల్లంకొండు సత్యనారాయణ, చాటకొండు సుబ్బారావు, కొలిశెట్టి శివప్రసాద్‌రావు,పబ్బతి చక్రపాణి, తులసి సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు.



## సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవిమాత

**బద్వేలు అర్బన్, అక్టోబరు 9 ప్రభాతవార్త :**
దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం బద్వేలు పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వి.సుబ్బారావు,గౌరవ అధ్యక్షులు పివిఎన్ ప్రసాద్, రాచపూడి సాయిక్రిష్ణ సెక్రటరీ కొలిశెట్టి నాగరాజ, ట్రెజరర్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు సగళా సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లు తో పాటు ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో తెల్లవారుజా మునుంచే అమ్మవారికి వివిధ రకాల విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు, భక్తి, శ్రద్ధలతో వాసవిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రసాదాలన స్వీకరించారు.రాత్రి అమ్మవారు చదువుల తల్లి సరస్వతిదేవి అలంకారంలో వాసవిమాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం నాటి ఉభయదాతలు కీ.శే. ఉరిమి సుబ్బరాయుడు ,కీ.శే. సతీమణి సావిత్రమ్మ, వీరి కుమారులు, కీ.శే.దుద్యాలపోలిశెట్టి సతీమణి సుబ్బలక్షుమ్మ, వీరి కుమారుడు సత్యనారాయణ, అల్లుల్లు రమసుబ్బయ్య, సతీమణి పోలమ్మ, సత్యనారాయణ సతీమణి సుభాషిణి, పైడిమర్రి నాగరాజు, సతీమణి లక్ష్మిదేవి, వీరి కుమారుడు సురేష్‌బాబు, సతీమణి నాగజ్యోతి, కుమారుడు వర్షిత్‌అభ్యాస్, యశ్వంత్, సుదర్శన్‌బాబు, మల్లికార్జున, పరిటాల వెంకట సుబ్బయ్య సతీమణి వెంకటరత్నమ్మ, వీరి కుమారుడు పరిటాల వెంకటేశ్వర్లు, సతీమణి శుభ, వీరి కుమార్తె వర్షిత, అల్లుడు సుంకు సురేష్‌బాబు, సతీమణి వరలక్ష్మి కుటుంబ సభ్యులను కమిటి సభ్యులు ప్రత్యేక బ్యాండు మేళతాళాలతో అమ్మవారి శాల వద్దకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.





# సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చిన స్వామివారు

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటి ధర్మకర్త ప్రొద్దుటూరు కిశోర్‌కుమార్, అధ్యక్షులు దేవతి సురేంద్ర, సెక్రటరీ ఇమ్మడిశెట్టి సత్యనారాయణల ఆధ్వర్యంలో వేదపండితులు ఓరుగంటి సీతారామశాస్త్రి, ప్రసాద్(అప్పి) తో పాటు మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి అభిషేకం, సహస్రనామార్చనతో పాటు పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా మదళ్లపల్లె సునీల్‌కుమార్,సతీమణి నాగలక్ష్మి, మదుళ్లపల్లె కిరణ్‌కుమార్ సతీమణి సరితమ్మ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీలు చిప్పగిరి ఆంజనేయులు, దేవతి సుధాకర్, ట్రెజరర్ దేవతి మల్లికార్జున,వైస్ ప్రెసిడెంట్లు ఓబుళశెట్టి చిన్న సుబ్బరాయుడు, తిరువీధి లక్ష్మణరావు, వడ్లపూటి నాగభూషణం, యువజన సంఘం అధ్యక్షులు చిన్న సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సాయి కార్తీక్, గౌరవాధ్యక్షులు పత్తి సాయి పవన్, అడ్వయిజర్ మిట్టా సాయికుమార్, కొప్పురపు తరుణ్, ట్రెజరర్ ఓరుగంటి సాహస్ మిత్ర తో పాటు పలువురు కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





## సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారు

**దువ్వూరు, అక్టోబర్ 09, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరు అమ్మవారి శాల వీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు బుధవారం సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారి దర్శణం ఇచ్చారు. వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరు అమ్మవారి శాలలో శ్రీ సరస్వతి దేవి అలంకారం



ప్రొద్దుటూరు శ్రీ చెన్నకేశవ దేవాలయంలో సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శణమిచ్చిన అమ్మవారు

## హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి



గర్భిణీలకు పండ్లు పంపిణీ చేస్తున్న డార్టర్లు

**బద్వేల్, అక్టోబర్09,ప్రభాతవవార్త :**
మండలంలోని హైరిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి మాతృ మరణాలు శిశు మరణాలు అరికట్టండి అని తొట్టివారిపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. బుధవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ అభయాన్ సురక్షిత కార్యక్రమము డాక్టర్లు వినయ్‌కుమార్, విశ్వంత్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గర్భిణీలు అందరికీ సరైన ఆరోగ్య పరిక్షలు వైద్య సేవలు అందించి మరియు ముఖ్యంగా కష్టతరమైనటువంటి గర్భిణీలను గుర్తించి 102,108 వాహనము ఉపయోగించుకొని సరైన సమయంలో సరైన చికిత్సలను అందించవలసినదిగా సిబ్బందికి ఆదేశించడమైనది. అదేవిధంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, మెదలగు ఎక్కువగా జ్వరాలు ఉన్నందువలన పరిసరాలు, పారిశుద్ధ్యం పైన ప్రజలకు అవగాహన కల్పించి విలేజ్ హెల్త్ క్లీనిక్ నంద మరియు ఆరోగ్య కార్యకర్తల దగ్గర అందుబాటులో ఉంచవలసినదిగా ఆరోగ్య సిబ్బందికి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం గర్భిణీ స్త్రీలకు సిబ్బంది సహకారంతో పండ్లు, మధ్యాహ్నం భోజనం అందజేశారు. అనంతరం ఆరోగ్య మిత్ర ద్వారా గవర్నమెంట్ ఆసుపత్రి కాన్పు, ప్రధాన మంత్రి మాతృత్వ యోజనా కార్యక్రమము, పిసిపియన్‌టి చట్టం గురించి పోషకాహారం పై అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమములో హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య, విలేజ్ హెల్త్ క్లీనిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్,హెల్త్ సూపర్‌వైజర్ కె వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

**గాలివీడు, అక్టోబర్ 9(ప్రభాతవార్త):**
దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఏడవ రోజు సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గోపనపల్లి గ్రామం పూజారివాండ్లపల్లెలోని ఇరుగులమ్మ ఆలయంలో బుధవారం వేదపండితులు నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.



## సరస్వతిదేవి అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
దసరా ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారు భక్తాదులకు సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలయకమిటీ ఛైర్మెన్ పురాణం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారి దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తాదులకు ఉప్పు రామచంద్ర, వారి కుమారులు, మేకల పురుషోత్తం రజని సిల్క్స్‌వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



## సరస్వతి అలంకరణలో..

**మదనపల్లె, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ ఆధ్వర్యంలో అమ్మవారికి వైభవంగా పూజలు జరిగాయి. ఉభయ దారులుగా నెహ్రూబజార్, ఆర్ఆర్ వీధి జ్యులరీస్ వారు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలంకరణలో అమ్మవారు అత్యంత సుందరీకరణగా భక్తులకు దర్శనమిచ్చారు.






వార్త

రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

| అన్నమయ్య జిల్లా | కడప జిల్లా |
|---|---|
| వీరబల్లి, | ప్రొద్దుటూరుక్రైం, |
| సంబేపల్లి, | మైలవరం, |
| పుల్లంపేట, | కమలాపురం |
| రాయచోటి అర్బన్, | మైదుకూరు రూరల్, |
| బి.కొత్తకోట, | కలసపాడు, |
| బి.టిఎం., | ఖాజీపేట, |
| వాయల్పాడు, | పోరుమామిళ్ల, |
| కలకడ | జమ్మలమడుగు రూరల్ |

మీ పూర్తి బయోడేటాతో
14వ తేది సోమవారం క్రింది చిరునామాలో సంప్రదించగలరు

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.
సెల్ నెం. 9848787289, 8919566086